క్లుప్తంగా

పంటల మార్పిడితో లాభాలు



పెసర పంటను పరిశీలిస్తున్న విజయ్, పల్లవి

బెజ్జంకి(సిద్దిపేట): రైతులు పంటల మార్పిడి చేయడం వల్ల భూసారం పెరిగి అధిక దిగుబడి సాధించవచ్చని ఏరువాక శాస్త్రవేత్తలు విజయ్, పల్లవి తెలిపారు. మండలంలోని వడ్లూరులో రైతు రమేశ్ సాగుచేసిన పెసర సాగును శనివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంజీజీ 389 పెసర వంగడాన్ని సాగు చేయడం వల్ల పల్లాకు తెగులు సోకదన్నారు. అలాగే ఎకరాకు సుమారు ఏడు క్వింటాళ్ల దిగుబడి వస్తుందని చెప్పారు. రైతు సాగు చేసిన ఐదెకరాల పెసరలో 35 క్వింటాళ్ల వరకు దిగుబడి రావచ్చని, ఇప్పటి వరకు రూ.62వేలు ఖర్చు చేసినట్లు తెలిపారు. మధిరలలోని అభ్యుదయ రైతు సంఘంలో రైతు రఘువీర్ సాగుచేసిన ఫౌండేషన్ సీడ్‌తో పంట వేసినట్లు రైతు రమేశ్ తెలిపారు.

వాసవీక్లబ్ నూతన కార్యవర్గం



బాధ్యతలు చేపట్టిన కార్యవర్గ సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వాసవీ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు శనివారం జిల్లా కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. సిద్దిపేట వాసవీక్లబ్ అధ్యక్షుడిగా మొరంశెట్టి కుమార్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి రమేశ్, పీఆర్‌ఓ మర్యాల వీరేశం బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు గంపశ్రీనివాస్, గంపకృష్ణమూర్తి, మాంకాల నవీన్ కుమార్, చకిలంరవి, నేతి వేణుకుమార్, పూల్లురి శ్రీనివాస్, శశాంక్, రవి, హరికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే గుర్తింపు



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ సత్తయ్య

కొండపాక(గజ్వేల్): చదువుతోనే సమాజంలో గుర్తింపు పొందగలమని ఎంఈఓ బచ్చలి సత్తయ్య అన్నారు. కుకునూరుపల్లి మండలంలోని మేదినీపూర్, రామునిపల్లి, ముద్దాపూర్ ప్రాథమిక పాఠశాలలను శనివారం ఆయన సందర్శించారు. ఉపాధ్యాయుల పనితీరు, బోధన, మధ్యాహ్న భోజన నిర్వహణ గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచే క్రమ శిక్షణతో కూడిన విద్యనందించాలన్నారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని, విద్యార్థులకు రుచికరమైన భోజనం అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాత మెనూ అమలు చేస్తున్న వార్డెన్‌లు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సిద్దిపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం నూతనంగా అమలు చేస్తున్న భోజన మెనూను కాదని పాత మెనూనే అమలు చేస్తున్న వార్డెన్‌లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కలెక్టరేట్ ఏఓకు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు దాసరి ప్రశాంత్ మాట్లాడుతూ ప్రభుత్వం నూతన మెనూను ప్రకటించి రెండు నెలలు గడుస్తున్నా నేటికీ అమలు కావడం లేదన్నారు. నూతన మెనూ అమలుచేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, అభిషేక్, భాను తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల పరిశీలన

హుస్నాబాద్: స్థానిక బస్టాండ్ జీ ప్లస్ బిల్డింగ్ నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వారు ఆధునీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బస్టాండ్ నిర్మాణం కోసం కృషిచేసిన మాజీ ఎమ్మెల్యే దేశిని చిన మల్లయ్య పేరుతో ఉన్న శిలాఫలకాన్ని తొలగించడం సరికాదన్నారు. బస్టాండ్‌లో క్యాంటీన్ కూడా ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాషా, నియోజకవర్గ అధికార ప్రతినిధి మల్లికార్జున్ రెడ్డి, కౌన్సిలర్ హరీశ్, సతీశ్ తదితరులు ఉన్నారు.

వరినారును సంరక్షిద్దాం

పెరిగిన చలి తీవ్రతతో వరి నాళ్లు చీడపీడల భారిన పడుతున్నాయి. యాసంగి సాగుకు రైతులు నార్లు పోశారు. అయితే రాత్రి ఉష్ణోగ్రతలు 12డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువ ఉంటుండటంతో చలి తీవ్రత పెరిగి నారు సరిగా ఎదగడంలేదు. ఎర్రబడి, లేదా తెల్లగా మారి చనిపోతోంది. ముదురునార్లు నాటడం వల్ల దిగుబడులు కూడా చాలా తగ్గిపోతాయని వ్యవసయా నిపుణులు చెప్తున్నారు. డిసెంబరు రెండో వారంలోనే నాట్లు పూర్తిచేయాల్సి ఉండగా నారు ఇంకా రాకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది.

- ఉష్ణోగ్రతలు తగ్గితే ఎదుగుదలలో సమస్య
- యాజమాన్య పద్ధతులు పాటించాలి
- ఏఓ జయంత్



ఎర్రబడుతున్న వరి నారు

చిన్నకోడూరు(సిద్దిపేట): చలి తీవ్రత వల్ల సోకే తెగుళ్ల బారి నుంచి నారును కాపాడటానికి మండల వ్యవసాయ అధికారి జయంత్ కొన్ని సలహాలు, సూచనలు తెలియజేశారు.

చలి నుంచి కాపాడాలి..



జయంత్, ఏఓ

చలి తీవ్రత వల్లనే నారు దెబ్బతినే పరిస్థితులు ఏర్పడ్డాయి. జింక్‌లోపం వల్ల నారుమళ్లు దెబ్బతింటున్నాయి. రైతులు నీటిని ఎక్కువగా పెట్టవద్దు. రోజు విడిచి రోజు నీటిని పెడుతూ తర్వాత నారుమళ్ల నుంచి తొలగించాలి. ఉదయం ఆరు గంటలకు బోరు నుంచి వచ్చే వేడి నీటిని పెట్టి తర్వాత తీసివేయాలి. రాత్రి నారుమడిలో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. నారుమడిపై ఒక అడుగు ఎత్తులో వెదురు బద్దలతో ఊచలు అమర్చి దానిపై ప్లాస్టిక్ కవర్లు కప్పుకోవాలి. ఇనుప ధాతు నివారణకు రెండు గ్రాముల జింక్‌ను లీటర్ నీటిలో కలిపి చల్లుకోవాలి. చలి వల్ల నారుమడిలో జింక్ లోపం లక్షణాలు కనిపిస్తాయి. జింక్ నివారణకు లీటర్ నీటికి రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలని జయంత్ సూచించారు.

రిజర్వాయర్లు నింపండి.. నీరివ్వండి

- అసెంబ్లీలో మంత్రులకు విజ్ఞప్తి చేశా..
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



చేర్యాల(సిద్దిపేట): చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట)/మద్దూరు(హుస్నాబాద్): జనగామ నియోజకవర్గంలోని రిజర్వాయర్లు నింపి రైతులకు సాగునీరు అందించాలని, చేర్యాల ఆస్పత్రిని బాగుచేసి పేదలకు మెరుగైన వైద్యం అందించాలని అసెంబ్లీలో మంత్రులకు విజ్ఞప్తి చేశానని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చెప్పారు. చేర్యాలలోని ఓ ఫంక్షన్ హాల్‌లోను అలాగే మద్దూరు, దూళ్మిట్ట మండలాల్లో పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను శనివారం పంపిణీ చేశారు. చేర్యాలలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మంజూరైన చేర్యాల ఆసుపత్రి నిర్మాణ పనులు 90శాతం పూర్తయ్యాయి. త్వరగా పూర్తిచేసి అవసరమైన పరికరాలు, సరిపడా వైద్యులను నియమించి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని అసెంబ్లీలో మంత్రులను కోరానన్నారు. గడిచిన యేడాదిలో సుమారు వెయ్యికిపైగా సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేసినట్లు చెప్పారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల విషయంలోనూ ఒక్కరోజు ఆలస్యం కాకుండా ప్రభుత్వం ద్వారా అందిస్తున్నామన్నారు. ప్రజల సమస్య ఏదైనా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ స్వరూపరాణి, మాజీ ఎంపీపీ కరుణాకర్, పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశం, స్థానిక కౌన్సిలర్లు పాల్గొన్నారు. తర్వలోనే గండిరామారం, లద్నూరు, తపస్‌పల్లి రిజ్వాయర్ ద్వారా అన్ని చెరువులు నింపుతామని హామీ ఇచ్చారు. అలాగే కూటిగల్ చెరువును వారంలోపు నింపే బాధ్యత తనదేనన్నారు. అనంతరం ఆయనను దూళ్మిట్ట తహసీల్దార్ మధుసూదన్ శాలువాతో సన్మానించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన లద్నూరుకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు దండు సోమయ్యను పరామర్శించారు. కార్యక్రమంలో చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి, మద్దూరు, దూళ్మిట్ట మండల అధ్యక్షులు సంతోష్‌కుమార్, యాదగిరి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశం, మాజీ వైస్ ఎంపీపీ సుమలత, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, తహసీల్దార్‌లు మధుసూదన్, రహీం, మాజీ సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సమ్మయ్య, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు వెంకట్‌గౌడ్, రాములు, అనిల్, రఘు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

- గత ప్రభుత్వ అప్పుల వల్లే అమలులో జాప్యం
- మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

బెజ్జంకి(సిద్దిపేట): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. స్థానిక ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన మండలస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే పట్టుగొమ్మలన్నారు. గడప గడపకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకొని తన దృష్టికి తీసుకు వస్తే వాటిని పరిష్కరిస్తానని చెప్పారు. పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందని హామీ ఇచ్చారు. వారికి ఏ ఇబ్బందులున్నా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, పార్టీ మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, అనుబంధ విభాగాల అధ్యక్షులు రాములు, మల్లేశం, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ములుగు(గజ్వేల్): మండలంలోని తున్కిబొల్లారం పారిశ్రామిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

క్రీడాకారుల జాబితాను అందించండి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఖోఖో క్రీడాకారులు, క్లబ్‌లు, సొసైటీల జాబితాలు అలాగే రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను రాష్ట్ర అడ్‌హక్ కమిటీకి అందించాలని కమిటీ కన్వీనర్ మహేందర్‌రావు, సభ్యులు పోచప్ప, నాగరాజు శనివారం ఒక ప్రటకనలో పేర్కొ న్నారు. డాక్యుమెంట్ కాఫీలను 7వ తేదీలోగా ఫిజికల్ డైరెక్టర్‌కు అందించాలని, జాబితాను అనుసరించి ఉమ్మడి మెదక్ జిల్లా ఖోఖో కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపా రు. మరిన్ని వివరాలకు 98665 46563 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రేషన్ బియ్యంలో..

జగదేవ్‌పూర్(గజ్వేల్): పేదలకు అందజేసిన రేషన్ బియ్యంలో పెళ్లి ఒడిబియ్యంలో కలిపే రంగులబాల్స్ రావడంపై ఆసక్తిగా మారింది. మండలంలోని తిగుల్ గ్రామంలో రేషన్ దుకాణంలో బియ్యం తీసుకోవడానికి వెళ్లిన లబ్ధిదారులు బియ్యం బస్తాలో బాల్స్ చూసి మరో సంచి నుంచి ఇవ్వాలని డీలర్‌ను అడిగి తీసుకున్నారు. బస్తాపై లాట్ చూస్తే వర్గల్ మండలం మక్తమాసాన్‌పల్లి రైస్‌మిల్లు నుంచి వచ్చినట్లు ఉందని, సివిల్ సప్లయ్ అధికారులకు చెప్పినట్లు డీలర్ శనివారం తెలిపారు.

వ్యవసాయంపై అవగాహన

సిద్దిపేటరూరల్: ప్రస్తుతం జరుగుతున్న పరిశోధనలు, వాటివల్ల రైతులకు కలిగే ప్రయోజనాల గురించి ప్రధాన శాస్త్రవేత్త, ప్రిన్సిపాల్ డా.శ్రీదేవి విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. తోర్నాల పాఠశాల విద్యార్థులు, దుబ్బాక మాస్టర్ మైండ్ స్కూల్ విద్యార్థులు పరిశోధనా స్థానం, పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ నూతన పరిశోధనలు, అధునాతన వ్యవసాయ యంత్రాలు, వాటి వినియోగం గురించి వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు జయ, పల్లవి, సతీశ్, ఏరువాక కేంద్రం హెడ్ విజయ్, హెచ్‌ఎం సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

డీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

హుస్నాబాద్: ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ రమణారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం నూతన సంవత్సర డీటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం వాసుదేవ రెడ్డి, మండల అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, వీరారెడ్డి, సువర్ణలీల, రాజేందర్ పాల్గొన్నారు.

క్రమశిక్షణకు మారుపేరు పోలీసుశాఖ

- అదనపు డీసీపీ రాంచందర్‌రావు



సీఏఆర్ హెడ్‌క్వార్టర్ ఆవరణలో పోలీసుల స్వచ్ఛ్ భారత్

చిన్నకోడూరు(సిద్దిపేట): క్రమశిక్షణకు మారుపేరు పోలీస్‌శాఖ అని, ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని ఏఆర్ అదనపు డీసీపీ రాంచందర్‌రావు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని పెద్దకోడూరు శివారులోని సీఏఆర్ హెడ్ క్వార్టర్‌లో పోలీస్ అధికారులకు, సిబ్బందికి శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పోలీస్ సిబ్బందికి సమయపాలన ముఖ్యమన్నారు. సోషల్ మీడియాను నాలెడ్జ్ పెంచుకోవడానికి ఉపయోగించుకోవాలని, ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లకు అలవాటు పడి కుటుంబాలను విచ్ఛిన్నం చేసుకోవద్దన్నారు. ఏ సమస్యలు ఉన్నా అధికారులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీపీ సుభాష్ చంద్రబోస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌లు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం సీఏఆర్ హెడ్‌క్వార్టర్‌లో అధికారులు, సిబ్బంది స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. పరిసర ప్రాంతాలలోని పిచ్చి మొక్కలు, చెత్తా చెదారం తొలగించి మొక్కలు నాటారు.

నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి



ప్రాజెక్టులను తిలకిస్తున్న ఎంఈఓ కృష్ణ

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని గజ్వేల్ మండల విద్యాధికారి కృష్ణ సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లోగల సెయింట్ మేరీస్ విద్యానికేతన్‌లో శనివారం సీబీఎస్‌ఈ విద్యార్థులు ఆర్ట్, క్రాఫ్ట్, కంప్యూటర్ తదితర సబ్జెక్టులపై ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా వింటూ నూతన ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. ఉపాధ్యాయుల సహకారంతో ప్రయోగాలుచేసి తమలోని ప్రతిభను వెలికితీయాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను తిలకించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గోపు ఇన్నారెడ్డి, ప్రిన్సిపాల్ విజయపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలతోనే ప్రమాదాల నివారణ

- మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌లు



చేర్యాల(సిద్దిపేట): వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న క్రిస్టోఫర్

చేర్యాల(సిద్దిపేట)/గజ్వేల్‌రూరల్/సిద్దిపేటకమాన్: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌లు పిలుపునిచ్చారు. శనివారం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పలు మండల కేంద్రాల్లో వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా చేర్యాలలో ఇన్‌స్పెక్టర్ క్రిస్టోఫర్ మాట్లాడుతూ మద్యంతాగి వాహనాలు నడపవద్దని, ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ జితేందర్‌రెడ్డి, కానిస్టేబుల్ జయలక్ష్మి, హోంగార్డు నరేశ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ లోగల జీపీపీ(గజ్వేల్-ప్రజ్ఞాపూర్) ఆర్టీసీ డిపోలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంవీఐ క్రిస్టొఫర్, గజ్వేల్ సీఐ సైదా పాల్గొన్నారు. ఆర్టీసీ డ్రైవర్లు మానసిక ఒత్తిడి తగ్గించుకొని ఏకాగ్రతతో బస్సులు నడపాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ జీపీపీ డిపో మేనేజర్ పవన్, అసిస్టెంట్ మేనేజర్ బాబునాయక్, ఎంఎఫ్ జమిల్, ఏఎంఎఫ్ శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు. అదేవిధంగా సిద్దిపేట ఆర్టీసీ డిపోలో ఏంవీఐ శంకర్‌నారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్‌ఐ గోపాల్‌రెడ్డి, ఏఎంవీఐ నేహ, డీఎం సుఖేందర్‌రెడ్డి, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

హుస్నాబాద్‌రూరల్/అక్కన్నపేట(హుస్నాబాద్): రానున్న సంక్రాంతి పండగను పురస్కరించుకొని పల్లెల్లో స్వశక్తి సంఘాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం హుస్నాబాద్‌రూరల్‌లోని గాంధీనగర్, పందిల్ల, పోతారం(ఎస్) గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. గ్రామాల్లో ప్రతిభ కనబర్చిన మహిళలను మండల స్థాయి పోటీలకు పంపించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, హారిక, ఎల్లయ్య, సీసీలు, సీఏలు పాల్గొన్నారు. అలాగే అక్కన్నపేట మండల కేంద్రంలో విజేతలకు కాంగ్రెస్ గిరిజన నేత చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు

సమస్యల వలయంలో పాలిటెక్నిక్ విద్యార్థులు

- యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర నేత శేఖర్

గజ్వేల్‌రూరల్: బాలుర ఎడ్యుకేషన్ హబ్ ఆవరణలోగల జీఎంఆర్(ప్రభుత్వ ఆదర్శ గురుకుల) పాలిటెక్నిక్ హాస్టల్ విద్యార్థులు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారని యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు శేఖర్ వాపోయారు. హాస్టల్‌ను శనివారం ఆయన సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో మెస్ బిల్లులు చెల్లించలేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. స్టూడెంట్ మేనేజ్‌మెంట్ హాస్టల్‌గా మార్చడంతో విద్యార్థులు ప్రతినెలా డబ్బులు చెల్లించలేక మధ్యలోనే చదువు ఆపేసే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రెసిడెన్షియల్‌గా మార్చాలని డిమాండ్ చేశారు. వెంటనే విద్యార్థుల తో విద్యార్థులతో కలసి ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

లోక కల్యాణం.. మహాయజ్ఞం



ప్రతులతో రామకోటి రామరాజు, గ్రామస్తులు

వర్గల్(గజ్వేల్): లోక కల్యాణమే పరమావధిగా శృంగేరి పీఠం చేపట్టిన హరిహర లిఖిత మహాయజ్ఞంలో భాగంగా శనివారం వర్గల్ మండలం నెంటూరు హనుమాన్ మందిరంలో శ్రీరామకోటి భక్తసమాజం ధార్మికసేవాసంస్థ ఈ కార్యక్రమం నిర్వహించింది. హనుమాన్ భక్తబృందం, గ్రామస్తులు హరిహర లిఖిత యజ్ఞంలో భాగస్వాములయ్యారు. భక్తిశ్రద్ధలతో శ్రీరామ, శివనామాలను పత్రాలపై లిఖించారు. లిఖిత ప్రతులను సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజుకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ భగవన్నామ స్మరణతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

కొండపాక(గజ్వేల్): మండలంలోని మర్పడ్గ హైస్కూల్లో శనివారం విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. హెచ్‌ఎం భైరయ్య పర్యవేక్షించారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు.

సంక్షిప్త వార్తలు

◆ **బయోసైన్స్ టెస్ట్‌లో విద్యార్థులు**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆన్‌లైన్‌లో శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బయోసైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ప్రతిభ చూపారు. కార్యక్రమంలో డీఎస్‌వో శ్రీనివాస్, ఎంఈఓ ప్రభాకర్ రెడ్డి, టీబీఎస్‌ఎఫ్ సిద్దిపేట జిల్లా శాఖ అధ్యక్షుడు అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, కోశాధికారి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు మల్లారెడ్డి, భూపతి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

◆ **లేకదూడపై హైనా దాడి**

మద్దూరు(హుస్నాబాద్): హైనా దాడిలో లేగదూడ మృతి చెందిన ఘటన దూళ్మిట్ట మండలంలోని కూటిగల్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు తీగుళ్ల సంపత్ తన పశువులను రోజూ మాదిగానే శుక్రవారం రాత్రి తన వ్యవసాయ బావి కట్టేసి ఇంటికి వచ్చాడు. శనివారం ఉదయం వెళ్లి చూడగా లేగదూడ గాయపడి మృతి చెంది ఉండడంతో గమనించిన రైతు ఫారెస్టు అధికారులకు తెలియజేశాడు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫారెస్టు అధికారి రాముడు, పశువైద్యాధికారి ఉషారాణి పరిశీలించారు. లేగదూ హైనా దాడిలో మృతి చెందినట్లు వారు తెలిపారు.

◆ **నేటి విద్యార్థులు రేపటి శాస్త్రవేత్తలు**

కొమురవెల్లి(సిద్దిపేట): నేటి విద్యార్థులు బావి భారత శాస్త్రవేత్తలని మండల విద్యాశాఖ అధికారి రమేశ్ అన్నారు. మండలంలోని గురువన్నపేట ఉన్నత పాఠశాలలో శనివారం గణిత మేళా నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయులతో కలసి మేళాను ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన గణిత ప్రదర్శనలను తిలకించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **పాఠశాలలో నీటి వసతికి చర్యలు**

దౌల్తాబాద్(దుబ్బాక): దౌల్తాబాద్ మండల పరిధిలోని లింగరాజ్‌పల్లిలో ఎంజేపీ బాలుర పాఠశాలలో మిషన్ భగీరథ ద్వారా నీళ్లు అందించేందుకు చర్యలు చేపట్టారు. మిషన్ భగీరథ ఏఈ శనివారం హాస్టల్‌ను సందర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాములు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు లాలు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

◆ **పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి**

హుస్నాబాద్: పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు గంగిశెట్టి మహేందర్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం సంఘం మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కరువు భత్యాలను విడుదల చేయాలని కోరారు. అనంతరం మండల కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. సమావేశంలో టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గుగులోతు గాంధీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం**

దుబ్బాకటౌన్: సంగారెడ్డిలో 25నుంచి 28వరకు జరుగనున్న సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి భాస్కర్ పిలుపునిచ్చారు. మహాసభల కోసం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో దుబ్బాకలో శనివారం విరాళాలు సేకరించారు. నాలుగు రోజులు జరిగే ఈ సభలకు రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి మంది ప్రతినిధులు హాజరు కానున్నారని తెలిపారు. భాస్కర్, రాజు, లక్ష్మీ నర్సయ్య, మహేశ్, రాజు తదితరులున్నారు.

◆ **ముక్కోటి ఏకాదశికి రండి**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ముక్కోటి ఏకాదశి సందర్భంగా పట్టణంలోని మోహినిపూర వెంకటేశ్వర ఆలయంలో 10న జరగనున్న ఉత్సవాలకు హాజరు కావాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణకు ఆలయ కార్యనిర్వహణాధికారి విశ్వనాథశర్మ శనివారం ఆహ్వానపత్రికను అందించారు. కార్యక్రమంలో పూజారులు, ధర్మకర్త మండలి సభ్యులు పాల్గొన్నారు.

◆ **విద్యార్థులు ఒత్తిడికి లోనుకావొద్దు**

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనుకావద్దని హార్ట్‌ఫుల్‌నెస్ ప్రోగ్రామ్ స్పీకర్ వి.నాగేష్ సూచించారు. బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థినులు పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనుకావద్దని, ఏకాగ్రతతో చదువుకోవాలని సూచించారు. ధ్యానం చేయడం వల్ల మానసిక సమస్యలు దూరమవుతాయని చెప్పారు. స్టూడెంట్ కౌన్సిలర్ శ్రీదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

◆ **మర్యాదపూర్వక కలయిక...**

సిద్దిపేటజోన్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శనివారం పీసీసీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.